కరువు మండలాలుగా ప్రకటించాలి: తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి డిమాండ్ చేశారు. వైయస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లి లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు లేని కారణంగా పంటలు ఎండిపోతున్న వైసీపీ ప్రభుత్వం రైతుల పట్ల సహకరించకపోవడం దారుణమన్నారు. జూన్ నెల నుంచి ఇప్పటివరకు 719 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 504 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. 8 జిల్లాలలో మాత్రమే సాధారణ సగటు వర్షపాతం నమోదయింది అన్నారు. 18 జిల్లాలలో అతి తక్కువ వర్షపాతం నమోదయింది అన్నారు. 669 మండలాలకు 449 మండలాలలో అతి తక్కువ వర్షపాతం నమోదైనట్లు తులసి రెడ్డి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ సంబంధించి 40 శాతం పంటలు వేయలేదు అన్నారు. ఆర్ వై శాతం సాగు భూమిలో పంటలు వేసినా అవి వర్షాభావ పరిస్థితిలో వల్ల నిట్టనిలువునా ఎండుతున్నాయన్నారు. కరువు మేఘాలు కమ్ముకోవడంతో ప్రజలు కూలి పనులు లేక వలస బాట పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తులసి రెడ్డి పేర్కొన్నారు.

చెట్లు నాటారు... బిల్లులు మరిచారు

- మొక్కలకు రక్షణ కరువు

విశాలాంధ్ర-యర్రగుంట్ల: స్థానిక పురపాలక పరిధిలోని కడప రోడ్డు జువారి రైల్వే వంతెన వద్ద నుండి ముద్దనూరు రోడ్డు ఐసిఎల్ వరకు జాతీయ రహదారి డివైడర్ మధ్య భాగంలో ఇటీవల మొక్కలు నాటిన సంగతి తెలిసిందే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ5 లక్షలు ఇందుకోసం వెచ్చించారు. మొక్కలు నాటే సమయంలో చెట్లకు రక్షణగా గార్డులు ఏర్పాటు చేశారు. అయితే అవి ప్రస్తుతం అక్కడ కనిపించడం లేదు ఫలితంగా పశువులు మొక్కలను ధ్వంసం చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మొక్కలు నాటే పనిని పూర్తిచేసి మాసాలు గడుస్తున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్‌కు పురపాలిక యంత్రాంగం బిల్లు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ లబోదిబోమంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసిన ఈ పనికి బిల్లు రాక కాంట్రాక్టర్ అప్పులు చేయాల్సి వచ్చింది ఈ విషయంపై ఏ ఈ సురేష్ బాబును వివరణ కోరగా బిల్లుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపడం అన్నారు.

ప్రజా సమస్యలే నా ఆయుధం

సాహిత్యాన్ని ప్రజల్లో తీసుకువెళ్లటమే నా లక్ష్యం - ఆశయంతో ముందుకు వెళ్లిన మస్తాన్‌వలి

విశాలాంధ్ర - కార్పొరేషన్ : నిరంతరం ప్రజా సమస్యలే నా ఆయుధం ప్రజాశక్తి అనే సాహిత్యాన్ని తన భుజాలపై వేసుకొని ప్రజల్లోకి తీసుకుపోవటమే నా లక్ష్యం అని తన జీవితకాలం ఏదో ఒక సమస్యపై ప్రజలకు తెలియజేసుకుంటూ ముందుకు సాగిపోయిన వ్యక్తి కులమత బేధాలు లేనటువంటి సీనియర్ పాత్రికేయులు ఆప్ కి ఆవాజ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్ వలి మూడవ వర్ధంతి సభ ఆ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాష అధ్యక్షతన గురువారం నిర్వహించారు. మస్తాన్‌వలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా, యునైటెడ్ ముస్లిం ఫారం రాష్ట్ర అధ్యక్షులు రఫీ ఖాన్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా నాయకులు తస్లీమ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నూరే షరీఫ్,అన్వర్, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాసింలు మాట్లాడుతూ, సమాజం మార్పు కోసం మైనార్టీల హక్కుల కోసం ఏదో ఒక విధంగా శ్రమిస్తూ ముందుకు వెళ్లిన వ్యక్తి మస్తాన్వలి అని వారన్నారు. ప్రజాశక్తి వారపత్రికగా ఉన్న సమయంలోనే పత్రికను ప్రజల్లో తీసుకపోవటం కోసం మారుమూల గ్రామాలకు ప్రజాశక్తి సాహిత్యాన్ని తీసుకుపోవటం కోసం శ్రమించినటువంటి వ్యక్తి మస్తాన్ వలి అని వారన్నారు. అనేక సాహితీ కమిటీలలో పనిచేసిన వ్యక్తి మస్తాన్ అని వారాలన్నారు. మస్తాన్ ఆశయాలను తీసుకుపోవటం ఎంతో అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వారన్నారు. మస్తాన్ వలి పత్రిక రంగంలో ఉన్నప్పుడు చాలామందికి పత్రికల్లో అవకాశం ఇచ్చి వారికి మంచి భవిష్యత్తును ఇచ్చిన వ్యక్తి మస్తాన్ కానీ ఈరోజు ఆయన చేసిన సేవలను మరిచిపోవడం బాధాకరమని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి అవాజ్ నగర అధ్యక్షులు ఆబిద్ హుస్సేన్, జిలాన్, మైను, జమ్రుత్, రాయలసీమ మహిళా సంఘం నాయకులు కరీమున్, చాంద్ బేగం, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అన్వర్, జిలాన్ పాల్గొన్నారు.

దళితులు అధికార పదవులకు అర్హులు కారా

విశాలాంధ్ర-పీలేరు:-పీలేరు నందు మాలమహానాడు ఐక్యవేదిక జిల్లా కార్యాలయము నందు జిల్లా సమావేశము జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుం నారాయణ పాల్గొన్ని మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు దాటినా ఆనాటి నుండి ఈనాటి వరకు బహుజనులు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నోచుకోక అలాగే ఉన్నారు. వీరిలో ఎటువంటి బలమైన మార్పులు రాలేదు, రానివ్వలేదు. కేవలం కొన్ని సామాజిక వర్గాలకే పరిమితమైన అధికార పదవులు వేరొకరికి అందనివ్వలేదు. ఆ విధంగా ప్రయత్నించినా ప్రాణాలు పోగొట్టుకోవడం తప్ప సాధించింది ఏమి లేదు. ఎన్నికలలో దళితులకు పథకాలు ఇస్తారే తప్ప పదవులు ఇస్తామని ప్రకటించరు. పథకాలతో ఎవ్వరూ అభివృద్ధి కాలేరని, వారికి తెలుసు అందుకనే పథకాలతో ప్రభుత్వాలను స్థాపిస్తూ, ప్రజలను, దళితులను పాలిస్తూ, ప్రజలను ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. ఇప్పటికీ దళిత బహుజనులు నాయకులు కాలేకపోతున్నారు. ఇకనైనా దళితబహుజనులు ఏకతాటిపై పోరాడి అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం నాయకత్వం, రాజ్యాధికార పదవులను సాధిద్దామని పిలుపునిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో మన గళాన్ని, దళితుల ఓటు బలాన్ని వియోగించి మన హక్కుల సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రీజనల కన్వీనర్ చీకటిపల్లి రామాంజులు చిత్తూరు ఉమ్మడి జిల్లాల ప్రధానకార్యదర్శి గుంతాటి మురళి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పాటూరు దామోదరం, మహిళా అధ్యక్షులు రెడ్డెమ్మ, పీలేరు మండల నాయకులు పాటూరు నాగరాజా,పాటూరు నారాయణ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కళల ద్వారా సామాజిక ప్రగతి

తొగటవీర క్షత్రియ చైతన్య గీతా ఆవిష్కరణలో మేయర్

విశాలాంధ్ర-కార్పొరేషన్ : కళల ద్వారా సామాజిక ప్రగతి సాధ్యమని కడప నగర మేయర్ కె. సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ చైతన్య దృశ్య శ్రవణ గీతాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు కారణజన్ములని వారు ప్రదర్శించే కళల ద్వారా సామాజిక ప్రగతి సాధ్యమని, కలల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా ప్రాచీన కలలు ప్రముఖ పాత్ర వహించాయని, కళారూపాలను సంరక్షించుకొని కళాకారులను ఆదుకోవాలని ఆయన తెలిపారు. తొగటవీర క్షత్రియ చైతన్య గీతంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, సాధక బాధలను కళ్లకు కట్టినట్లు చూపించి ఐక్యమత్యం ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందని సమాజానికి సందేశం ఇవ్వడం ఎంతైనా అభినందనీయం అన్నారు. ఈ గీతాన్ని సూరిబాబు అద్భుతంగా తెరకెక్కించారని అన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి , తోగట వీరక్షత్రియ కులస్తుల సంక్షేమానికి తనవంతు బాధ్యతగా ఎటువంటి సహకారాన్ని అయినా అందిస్తానని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, కార్పొరేటర్లు మల్లికార్జున, రామ లక్ష్మణ రెడ్డి, రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు సిబ్యాల విజయభాస్కర్, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ, సిఆర్ఐ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సీఆర్ఐ సునీల్ జయంత్, 21 డివిజన్ ఇంచార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు ,రేఖం ఆంజనేయులు, ఈడెం లక్ష్మీనారాయణ ,చిత్ర గీతం దర్శకులు హబిబ్,సంగీత దర్శకులు సిహెచ్ బాబు, డీఓపీ పెద్ద బుద్ధి ప్రసాద్, చౌడం నాగార్జున పాల్గొన్నారు.

ఆటో ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-మదనపల్లి: ఆటో ఢీకొని ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. ఇందుకు సంబంధించి మదనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోటవారిపల్లి పంచాయతీ, అడవిలో పల్లెకు చెందిన రైతు జి.వెంకటరమణ(76), బైకులో సొంత పనిమీద మదనపల్లికి వస్తుండగా మార్గమధ్యంలోని మదనపల్లి-చెంబకూరు రోడ్డు రామపురం వద్ద, నారమాకుల తండాకుచెందిన ఆటో డ్రైవర్ వేగంగా వచ్చి బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధిత రైతును స్థానికులు గుర్తించి 108 వాహనములు చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం దాక్టర్లు మెరుగైన వైద్యం అందించి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో కుటుంబీకులు అతన్ని రుయా ఆస్పత్రిలో చేర్పించారు.

జాతీయ ఫ్యామిలీ ఆరోగ్య సర్వే విజయవంతం చేయాలి

- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు

విశాలాంధ్ర -కడప: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఎన్ ఎఫ్ హెచ్ ఎస్-6 సర్వే మీద జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అధ్యక్షతన జిల్లా నోడల్ ఆఫీసర్స్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, సూపర్ వైజర్ స్టాఫ్‌కి రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ జరిగినది. ఈ ట్రైనింగ్‌లో డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జాతీయ ఫ్యామిలీ ఆరోగ్య సర్వే సిక్స్ విజయవంతం చేయాలని తెలిపారు. డాక్టర్ శశి భూషణ్ రెడ్డి డీపీఎంఓ మాట్లాడుతూ ఇది ఆరోగ్య సేవలకు సంబంధించిన సర్వే ఈ సర్వేలో వివిధ ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ స్థాయిలో అందుతున్నాయో అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం చేయిస్తున్న సర్వే అని తెలిపారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వంటి ప్రయోజనాలు తీసివేయబడవు. ప్రజలకి ప్రతి ఆరోగ్య సేవలు పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సర్వే చేస్తున్నప్పుడు వారిలో సందేహాలు కలగకుండా వాళ్లకి వినయంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ ఎన్ఓ హరి, ఏఎస్ఓ జాకోబు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్సి ప్రక్రియను తప్పులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఎఫ్ఎల్సి ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి గిరీష పి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న గోడౌన్లో భద్రపరచబడిన ఈవీఎంలను, అక్కడ జరుగుతున్న ఎఫ్.ఎల్.సి. ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఈవిఎం ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 6:30 వరకు కొనసాగుతున్నట్లు డ్వామా పిడి మరియు ఈవీఎంల జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎం.సి.మద్దిలేటి కలెక్టరుకు వివరించారు. ఎఫ్ఎల్సి ప్రక్రియకు హాజరవుతున్న సిబ్బంది, బెల్ ఇంజనీర్లు, పొలిటికల్ పార్టీల హాజరు పట్టికలు, నిర్దేశించిన అనెక్సర్లు 3, 5, 11, 12, 13, 14 లను, అక్కడి ఏర్పాట్లను కలెక్టరు పరిశీలించడం జరిగింది. అనంతరం ఈవిఎంల పనితీరును, వాటిని తనిఖీ చేస్తున్న వివరాలను అక్కడి బెల్ ఇంజనీర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు చేశారు. అలాగే ఈవిఎం గోడౌన్ ను పరిశీలించారు. నిర్వహిస్తున్న విజిటర్స్ రిజిష్టర్, భద్రత ఏర్పాట్లు తదితరాలను పరిశీలించారు. ఎఫ్ఎల్సీ హాల్ వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అవసరమైన మందులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అన్నమయ్య జిల్లాలో ఎఫ్ఎల్సి ప్రక్రియ నిబంధనల మేరకు పక్కగా నిర్వహించాలని ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, డ్వామా పీడీ మరియు ఈవీఎంల జిల్లా ప్రత్యేక అధికారి ఎం.సి. మద్దిలేటి, తాసిల్దార్ ప్రేమంత కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బెల్ ఇంజనీర్లు, భద్రతా సిబ్బంది, విధులు కేటాయించబడిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో రక్త హీనత రహిత జిల్లాగా తయారు చేద్దాం:డిఈవో

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికల్లో నివారించి అన్నమయ్య జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా తయారు చేద్దామని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక డీఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బాలికలు- సమాజ సమగ్ర వికాసానికి ప్రతీకలు"అని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాల్లో బాగంగా వారికోసం ఐరన్ ఫోలిక్ యాసిడ్(ఐఎఫ్ ఏ)టాబ్లెట్స్ సరఫరా చేస్తోందన్నారు.కావున ఉపాధ్యాయులు రక్తహీనత గల విద్యార్థినులకు ప్రతిరోజూ రెండు టాబ్లెట్స్ ఇవ్వాలన్నారు.సాధారణ స్థాయిలో హిమోగ్లోబిన్ స్థాయిగల ఆరోగ్యవంతమైన బాలికలకు ప్రతి గురువారం ఒక టాబ్లెట్ ఇవ్వాలన్నారు.ముఖ్యంగా 3 -5 తరగతుల బాలికలకు పింక్ కలర్,ఆ పైతరగతుల బాలికలకు బ్లూ కలర్ టాబ్లెట్స్ ఇస్తారన్న విషయం గమనించాలన్నారు.విద్యా సంస్థలను సందర్శించిన సమయంలో పరిశీలిస్తే చాలాచోట్ల ఐరన్ పోలిక్ యాసిడ్(ఐఎఫ్ఏ)టాబ్లెట్స్ వినియోగంపై అవగాహన లోపం కనిపించిందన్నారు.అలాగే ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ చాలా చోట్ల అందుబాటులో లేని విషయం గమనించానన్నారు.వెంటనే సంబంధిత ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ లు నిర్దేశిత ప్రోఫార్మలో నమోదు చేసి డిఇఓ కార్యాలయానికి అందిస్తే వెంటనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.టాబ్లెట్స్ విద్యార్థినులకు వేయించడం ఎంత ముఖ్యమో,దానిని యాప్ లో నమోదు చేయడం కూడా అంతే ముఖ్యం అన్నారు.యాప్ లో నమోదు చేయకపోతే సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ సమీక్షల్లో బిక్కమొహం వేయాల్సిన పరిస్థితి రావచ్చునన్నారు.అలాగే మెడికల్ సిబ్బంది ప్రతి 3 నెలలకు ఒకసారి విద్యార్థినులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించిన వివరాలు,విద్యార్థినుల హిమోగ్లోబిన్ స్థాయి వివరాలతో పాటు ఐరన్ పోలిక్ యాసిడ్(ఐఎఫ్ఏ)టాబ్లెట్స్ పంపిణీ,స్టాక్ వివరాలు తెలిపే రిజిస్టర్లు పలుచోట్ల నిర్వహించడం లేదని గుర్తించామన్నారు.ఇది మళ్ళీ పునరావృతం కాకుండా అందరూ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.సెలవులు వచ్చినపుడు ఆ రోజులకు సరిపడా టాబ్లెట్స్ విద్యార్థినులకు అందజేయాలన్నారు.రక్త హీనత లేని సంపూర్ణ ఆరోగ్యవంతమైన బాలికల వికాసం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరం భాగస్వాములం కావాలన్నారు.అక్షర క్రమంలో మాత్రమే కాదని,అన్ని కార్యక్రమాల్లో అన్నమయ్య జిల్లాను ముందువరుసలో నిలుపుదామని డీఈవో ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ కు విద్యార్థులు తిలకించాలి

- ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఎస్పీ కృష్ణా రావు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ కు విద్యార్థులు తరలివచ్చి తిలకించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణా రావు విద్యార్థులకు సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం రాయచోటి లోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ను ఆయన ప్రారంభించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణా రావు మాట్లాడుతూ పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, బాధ్యతలు తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. 1959వ సంవత్సరం, అక్టోబర్ 21న సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడక్ ఆక్సాయ్‌చిన్ వద్ద చైనా సైనికులను ప్రతిఘటిస్తూ చివరి రక్తం బొట్టు వరకు పోరాడి దేశ కోసం అశువులు బాసారని, ఆ పోలీసు అమరులను స్మరించుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు స్మారకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతి భద్రత నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లోని మరియు సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పోలీసులు పనితీరు, రికార్డుల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరించడం జరిగిందని తెలియజేసారు. విద్యార్థులు బాగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసులు వాడే పలు పరికరాలు కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్ గురించి మరియు అవి పనిచేయు విధానం గురించి ఎస్పీ గారు విద్యార్థులకు, ప్రజలకు స్వయంగా వివరించారు. ఈ కార్యక్రమంలో (అడ్మిన్) వి.బి. రాజ్ కమల్, డిఎస్పీ పి. మహబూబ్ భాష, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఖరీఫ్ - 2023కి ముగిసిన పంట నమోదు ప్రక్రియ

- 93311 మంది రైతులకు 204739.9 ఎకరాలలో ఈ క్రాప్ పంట నమోదు
- జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్ర నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనను జారీ చేశారు. ఖరీఫ్ సీజనులో 93311 మంది రైతులకు చెందిన 204739.9 ఎకరాలలో ఈ క్రాప్ పంట నమోదు పూర్తి చేశారు. అలాగే 201701 ఎకరాలకు గాను 92273 మంది రైతుల ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా యందు రైతులు సాగుచేసిన పంట వివరాలు ఈ క్రాప్ నందు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామ సభ యందు పంట నమోదు వివరములు పంట పేరు మరియు సాగు విస్తీర్ణం గ్రామ వ్యవసాయ సహాయకులు చదివి వినిపించాలన్నారు. నేటి నుండి ఈ నెల 29 వరకు రైతు భరోసా కేంద్రాల యందు సామాజిక తనిఖీ కొరకు పంట నమోదు వివరాల జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు. సామాజిక తనిఖీ మరియు గ్రామ సభల ద్వారా ఏవైనా పంట నమోదు వివరములు తప్పుగా నమోదు చేసినట్లయితే సరిదిద్దడానికి అవకాశం కలదని కావున గ్రామంలోని రైతులందరూ పాల్గొని పంట వివరములు సరిచూసుకోవాలని కోరారు. ఈక్రాప్ పంట నమోదు వివరములు రైతులకి సెల్ ఫోన్ ద్వారా మెసేజ్ ద్వారా పంపడం జరుగుతుందని మరియు రైతు భరోసా కేంద్రం యందు గ్రామ వ్యవసాయ సహాయకులు రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జాబితా యందు తప్పిదాల సవరణ కి ఇది చివరి అవకాశం. తరువాత తుది జాబితా యందు ఎటువంటి సవరణలు అంగీకరించడం జరగదు. జాబితా యందు సవరణలు పూర్తయిన తర్వాత నవంబర్ 1 వ తేదీ నాటికి తుది జాబితాను రైతు భరోసా కేంద్రాల యందు ప్రదర్శించడం జరుగుతుందని, వాటి ఆధారంగా పంట కొనుగోలు, పంటల బీమా మరియు పంట నష్టపరిహారం వంటి పథకాలు రైతులకి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పంట నమోదుపై జరుగుతున్న సామాజిక తనిఖీ మరియు గ్రామ సభల యందు మండల వ్యవసాయ అధికారులు మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించడం జరిగిందన్నారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రాయచోటి:విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబానికి పోలీస్ సంక్షేమం నుంచి రూ.1,75 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా అదనపు ఎస్పీ వి.బి.రాజ్ కమల్ చేతుల మీదుగా అందజేశారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి క్రిష్ణా రావు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదంలో మరణించిన పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఏ ఎస్పీ మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. రాయచోటి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన పి.మల్లికార్జున కుటుంబానికి పోలీసు వితరణ నిధి నుండి ఈ ఆర్థిక సాయం అందచేశామన్నారు. మరణించిన సిబ్బంది కుటుంబం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఏఓ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ ఇందు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సింహాద్రిపురం భక్తులు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గం సింహాద్రి పురానికి పలువురు భక్తులు తిరుమల శ్రీవారి సేవలకు వెళ్లారు. టీం లీడర్ లక్ష్మీకాంతరెడ్డి, పాత పల్లె మహేశ్వర్ రెడ్డి, యాగంటి బాలకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో మొత్తం 14 మంది భక్తులు సోమవారం సింహాద్రిపురం నుంచి వెళ్లారు. నేపథ్యంలో నాలుగో రోజు గురువారం వీరందరూ కళ్యాణ మండపం వద్ద సేవలందిం చేందుకు సీనియర్ అధికారి కాకినాడ సుబ్బారావు డిక్టరేషన్ ఇచ్చినట్లు బాలకృష్ణారెడ్డి తెలిపారు. వారం రోజుల పాటు సేవలు అందించిన అనంతరం తాము సింహాద్రిపురం గ్రామానికి చేరుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకొని సన్మార్గంలో నడవాలన్నదే తమ ఆశయమని వారు పేర్కొన్నారు.

జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023

- ఈ ఆదివారాల్లో జయహో

విశాలాంధ్ర- కలెక్టరేట్: ప్రారంభించిన రోజు నుంచి ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు, చిత్రబృందం అంకితభావంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టడంలో జీ తెలుగు తిరుగులేదన్నారు. ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబ అవార్డులను ప్రధానం చేయడం ద్వారా అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని నటీనటులను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రతి ఏటా వైభవంగా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మరింత ఘనంగా జరిగింది. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023 వెండితెర,బుల్లితెర తారల తళుకులుతోఅత్యంత వైభవంగా సాగిన కుటుంబంఅవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 29సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానుంది.అద్భుతమైన ప్రదర్శనలతో వినోదంగా సాగే ఈ కార్యక్రమంలో మీఅభిమాన నటులు ఏఅవార్డు గెలుచుకున్నారో తెలుసుకోవాలంటే మిస్ అవకుండా చూడాల్సిందే.అవార్డు విజేతలు, విజేతలకు అవార్డులు అందజేయడానికి విచ్చేసిన ప్రముఖులతోకార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జీ తెలుగు కుటుంబ సభ్యులతో పాటు నేచురల్స్టార్ నాని,రామ్ గోపాల్ వర్మ,సంయుక్తా మీనన్,రేణు దేశాయ్,అనిల్ రావిపూడి,తరుణ్ భాస్కర్,అనంత్ శ్రీరామ్,సుమ-రాజీవ్ కనకాల,రఘు బాబు,పాయల్ రాజ్పుత్,కావ్య కల్యాణ్ రామ్,అనసూయ తదితరులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఘనంగా జరిగిన వేడుకల్లో,టెలివిజన్సూపర్స్టార్ నిరుపమ్ పరిటాల అదిరిపోయే గిఫ్ట్ అందుకున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో గురువారం బద్వేలి మునిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు బద్వేలి శివశంకరరెడ్డి, డా.బద్వేలి శివప్రసాద్‌రెడ్డిలు వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సంధర్భంగా డా.బద్వేలి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులు ఎలాంటి ఆలోచనలు లేకుండా ఉన్నంతలోనే ప్రశాంతంగా ఉండాలన్నారు. అలాగే ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, మనసు ప్రశాంతంగా ఉండాలంటే ధ్యానం చేయాలన్నారు. అలాగే ఆశ్రమంలో వృద్ధులకు అన్ని సేవలు అందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు పోలిచెర్ల సుబ్బరాయుడు, మేనేజర్ రఘురామ్ లకు అభినందనలు తెలిపారు. అలాగే వృద్ధులకు భోజనం అనంతరం పండ్లు పంపిణి చేశారు.

సౌమ్యనాథస్వామిని దర్శించుకున్న ఒరిస్సా హైకోర్టు జడ్జ్

విశాలాంధ్ర-నందలూరు :: మండలంలో ప్రసిద్ధ గాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి దేవస్థానాన్ని ఒరిస్సా హైకోర్టు జడ్జ్ గౌరీ శంకర్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నందలూరు జూనియర్ సివిల్ జడ్జ్ కే.లతా ఆధ్వర్యంలో ఆలయ పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి వివరించి, ఆలయ మర్యాదలతో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పీవీసీ పైపులు

విశాలాంధ్ర-లింగాల: రాయితీపై ప్రభుత్వం రైతులకు పీవీసీ పైపులను మంజూరు చేసిందని వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాడా నిధుల ద్వారా రైతులకు పీవీసీ పైపులను అందిస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెక్టారు వరకు రాయితీపై పైపులను అందజేస్తామన్నారు. రెండించిల పైపులు 45 రూ.10250లు, రెండున్నర ఇంచిలు 30 పైపులు రూ.10400లు, మూడించిల 25పైపులు రూ.11వేలు, నాలుగించి 20 పైపులు రూ.12560లు చొప్పున రైతు వాటాగా నిర్ణయించారన్నారు. ఆ మేరకు అవసరమైన రైతులు డిడి చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. భూమి పాసుపుస్తకం జిరాక్స్, ఒన్‌బి, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్, కరెంటు బిల్లు, ఎస్సీ, ఎస్టీలైతే కుల ధ్రువకరణ పత్రం, పాస్‌పైజు పోటో దరఖాస్తునకు జతచేసి పంపాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు.

జెసిబిపై ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని నాక్ భవనములో గురువారం జెసిబి పై ఉచిత శిక్షణ తరగతులలో ప్రారంభించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(నాక్),ఎపిఎస్ ఎస్ డీసీ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా,ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పిఎం కేఈ వై 4.0 ఉచిత 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు రోజుకు నాలుగు గంటలపాటు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు.ఆపరేటర్ సర్వీసింగ్ లో కూడా మెళుకువలను సేఫ్టీ నేర్పిస్తామన్నారు. కార్యక్రమానికి హొజరైన్ శానీ మేనేజర్ ప్రేమ్ కుమార్, కిషోర్ లు తెలిపారు. ఈ మెషినరీ ద్వారా ఎక్స్కవేటర్ ఆపరేటర్ నందు అంతర్జాతీయ స్థాయి లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఎన్ ఎస్ డీసీ ద్వారా సర్టిఫికేట్ అందజేయనున్నారు. అంతే కాకుండా మరొక బ్యాచ్ కోసం కూడా ఆసక్తిగల 18 నుండి 30 సంవత్సరముల వయస్సు గల 8/10/ ఐటిఐ, డిప్లొమా లేదా డిగ్రీ చదివిన వారినుండి ధరకాస్తులను కోరుతున్నామని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ ఆదార్ కార్డు,రేషన్ కార్డు,పదవ తరగతి కి సంబంధించిన సర్టిఫికెట్స్, నాలుగు కలర్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పులివెందుల న్యాక్ సెంటర్ నందు సంప్రదించాలని అయన కోరారు. 998514 2155, 9000517637 నంబర్ నందు సంప్రదించ్చ వచ్చని వెల్లడించారు.

విశాలాంధ్ర వైఎస్ఆర్ కడప జిల్లా

జగన్‌ను భరతం పట్టడం ఖాయం: సీఎం రమేష్

విశాలాంధ్ర-పులివెందుల: అవినీతి, అక్రమాలు, అక్రమ సంపాదన తదితర విషయాలల్లో కూరుకుపోయిన ముఖ్యమంత్రి జగన్‌ను భరతం పట్టడం ఖాయమని పార్లమెంటు హౌస్ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్‌నాయుడు ధ్వజమెత్తారు. పట్టణంలో విజయాగార్డెన్స్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంతా లిక్కర్ మయమైందన్నారు. ఎన్ఆర్ఐ చెందిన ఓ నేత గుప్పిట్లో లిక్కరు వ్యవహారం నడుస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగం సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మద్యం, మైనింగ్, ఇసుక మాఫియా రాజ్యమేలుతోందన్నారు. వీటివల్ల ముఖ్యమంత్రి జగన్ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో లిక్కర్ వ్యవహారం ఓఎన్ఆర్ఐ చెందిన వ్యక్తి కనుసన్నల్లో నడుస్తోందన్నారు. జగన్ అవినీతి అక్రమాల గురించి సాక్షాదారాలతో అన్ని గణాంకాల వివరాలుతో తాము ఆడియో రూపొందించామని, త్వరలో ఆడియోను విడుదల చేస్తామన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క పరిశ్రమ కూడా స్థాపన కాలేదన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కడప జిల్లాలో కూడా ఎక్కడ పరిశ్రమలకు సంబంధించిన దాఖలాలు లేవన్నారు. కడప ఉక్కు పరిశ్రమ గురించి ఇంతవరకు జగన్ ఊసెత్తలేదన్నారు. కాకపోతే రెండు మూడు దఫాలు ప్రారంభించిన వాటినే తిరిగి పున:ప్రారంభించి శిలాఫలకం వరకే పరిమితమయ్యారని జగన్‌ను తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో ఇంతవరకు జరిగిన కుంభకోణాలు, అవినీతి, అక్రమాలు తదితర అడ్డగోలు వ్యవహారాలపై విచారణ చేపట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవినీతి పరుడిగా జగన్ మరోసారి అక్రమార్కుల జాబితాలో చేనున్నారని రమేష్ నాయుడు వెల్లడించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శశి భూషణ్ రెడ్డి, భాను ప్రకాష్, మహేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, హరి ప్రసాద్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 27న ఛలో మైదుకూరు

విశాలాంధ్ర- కలెక్టరేట్: రైతు సమస్యలపై శుక్రవారం చలో మైదుకూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్లకొండ శ్రీరాములు గురువారం డీసీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకించి జిల్లాలో కరువు విలయతాండం చేస్తుందని రైతులకు రైతు కూలీలకు పనులు లేక వలస పాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరి తాళ్లు బిగించాన్నారు. విద్యుత్ కోతలు పెరిగాయని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతులకు పంట నష్టపరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విష్ణు ప్రియతమ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకటరమణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి, నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు బాబు, మహమ్మద్ అలీ ఖాన్ కోపూరు శ్రీనివాసులు ఆనంద్ కుమార్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర - కడప : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులోపోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఏ.ఆర్, సివిల్ విభాగం లోని కానిస్టేబుల్ నుండి ఎస్.ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందికి " సోషల్ మీడియా దుర్వినియోగం- సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావం" అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలను ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్ డీఎస్పీ బి. రమణయ్య లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలరెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, డీటీఆర్బీ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి, సైబర్ సెల్ ఎస్.ఐ మధుమల్లేశ్వర రెడ్డి, ఆర్.ఎస్.ఐలు స్వామి నాయక్, అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది, న్యాయ నిర్ణేతలు గా విచ్చేసిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నగర్‌లో బాబుతో నేను

చిరువ్యాపారులతో భూపేష్ మాటామంతి

నిత్యా వసర వస్తువుల ధరలపై వ్యాపారుల ఆవేదన

విశాలాంధ్ర- యర్రగుంట్ల : స్థానిక పురపాలిక పరిధిలోని వినాయక నగర్‌లో టిడిపి శ్రేణులు గురువారం ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి నాయకత్వంలో బాబుతో నేను భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంత ప్రజలను నేరుగా కలుసుకొని పార్టీ కరపత్రాలను అందజేశారు. తాము అధికారంలోకి రాగానే చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని నొక్కి వక్కాణించారు. ఈ సందర్భముగా ఆయన ఆ ప్రాంతంలోని చిరు వ్యాపారులతో మాటమంతి కలిపారు. దుర్భరంగా మారిన వారి బ్రతుకుల వెతలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో జీవనం కష్టంగా మారిందని వ్యాపారులు భూపేష్ తో అన్నారు పగలంతా చిన్నపాటి వ్యాపారాలతో సరైన ఆదాయం లేక సతమతమవుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సాధక బాధలను సావధానంగా ఆలకించిన భూపేష్ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అవసరమైన పథకాలను అమలు చేయడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. అందరి జీవితాల్లో వెలుగులు సాధ్యమవుతాయని స్పష్టతనిచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టు జ్యూడిషియల్ రిమాండ్ అంశాలపై స్థానికులకు వివరించారు. ప్రభుత్వ కుట్ర లతోనే చంద్రబాబు జైలు జీవితం గడపాల్సి వచ్చిందని గుర్తు చేశారు. త్వరలోనే చంద్రబాబు విడుదలై ప్రజల మధ్యకు వస్తారని భూపేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల పర్యవేక్షకులు చదిపిరాళ్ల జయరామిరెడ్డి మండల బాధ్యులు మాలపాడు మోహన్ రెడ్డితోపాటు స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుతో నేను కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో టీడీపీ నియోజికవర్గ ఇంచార్జ్ డా.జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి చంద్రబాబు నాయుడుపై ప్రభుత్వం కక్ష సాధిపుతో కేసులు పెట్టి జైలుకు పంపిందని వివరిస్తూ కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజలు ఎప్పుడు ఇంత దుర్మార్గపు పాలన చూడలేదని, చంద్రబాబు నాయుడు తప్పుడు కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. వైకాపా నాయకులను ప్రశ్నించే సామాన్య ప్రజలను సైతం బెదిరించి తప్పుడు కేసులు బనాయించి వైసీపీ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన వైసీపీని ఇంటికి పంపడం ఖాయమని, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, జైలులో చంద్రబాబుకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, చంద్రబాబుకు ఏదైన జరిగితే వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపాళెం టీడీపీ రూరల్ మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, టీడీపీ బీసీ దేవాంగసాధికార సమితి రాష్ట్ర సభ్యుడు సివి మధుబాబు, టీడీపీ నాయకులు మస్తాన్ గోలే, అంపావతిన నాగసుబ్బరాయుడు, పెన్నానగర్ మజీద్‌తో పాటు టీడీపీ కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి-ప్రతి ఇంటికి రేషన్ అందించాలి

జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలో ఉన్న గ్రామాల వారీగా భూసమస్యలను పరిష్కరించి భూసర్వేను వేగవంతంగా జరిగేవిధంగా చూడాలని ప్రతి గ్రామ పంచాయతీలో టైమింగ్ సర్వేను వేగవంతం చేసి సమస్యలు పరిష్కరించే విధంగ చూడాలని రేపు నెల నుండి రేకులకుంట, డిరసవంచ, ముడమాల పంచాయతీల్లో భూసర్వేను వేగవంతంగా జరిగేవిదంగా చూడాలని తహసీల్దార్ సువర్ణదేవికి, డిప్యూటి తహసీల్దార్ జాన్సన్‌కు రెవెన్యూ సిబ్బందికి జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయంలో సూచనలు ఇచ్చారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ హైవే రోడ్డు పరిశీలన సమస్యలు లేకుండా చూసుకోవాలని రికార్డును క్షున్నంగా పరిశీలించి రైతులకు సమస్యలు లేకుండా, రైతు నష్టపోకుండా అధికారులు పరిశీలన చేపట్టాలని తెలిపారు. మల్లెపల్లె-నందిపల్లె హైవే రోడ్డును పరిశీలన కార్యక్రమంపైనే దృష్టి పెట్టుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రజాపంపిణీలో ప్రతి ఇంటికి రేషన్ అందేవిధంగా చూడాలని ప్రజాపంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని చిన్న చిన్న సమస్యలు తమ దృష్టికి రావద్దని ఆ సమస్యలు పరిష్కరించేవిధంగా రెవెన్యూ అధికారులే సమస్యలు పరిష్కరించేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా పలువురు అర్జీదారులు భూసమస్యలపై జేసీ దృష్టికి తీసుకువెల్లగా సమస్యలను పరిష్కరించేవిధంగా చూస్తామని ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగేవిధంగా అధికారులు దృష్టి పెడతామని, చిన్న చిన్న లోపాలను తరలింపు చేసి రైతులకు న్యాయంజరిగే విధంగా చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108కు ఫోన్ చేసి స్వయంగా ఆయన హాస్పిటల్‌కు తరలించారు. ఇది చూసిన పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, వీఆర్ఓలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టాలని జేసీకు వినతి

మండలంలోని భూ ఆక్రమణలు అరికట్టాలని ప్రతి స్మశాన వాటికకు రహదారులను ఏర్పాటుచేయాలని జాయింట్ కలెక్టర్‌కు బీజేపీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సంధర్భంగా జేసీ మాట్లాడుతూ స్మశాలన వాటికలపై రహదారుల కోసం సంబంధించిన వీఆర్ఓల ద్వారా తహసీల్దార్‌తో చర్చించి దారులు ఏర్పాటుచేస్తామని, భూ ఆక్రమణలు కూడ అడ్డుకట్ట వేస్తామని గతంలో ఉన్న రెవెన్యూ అధికారుల తప్పిదం వల్లనే ఈ విధంగా జరుగుతుందని, భూసర్వే ద్వారా పూర్తి చేసి నిజమైన రైతుకు పట్టదారు పాస్ బుక్కులు జారీ చేస్తామని సర్వే ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. పోలేరమ్మ గుడి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలు కూడ భూఆక్రమణ జరుగుతుందని అరికట్టాలని జేసీ దృష్టికి తీసుకువెల్లగా త్వరలో సమస్యలన్ని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

పేద ప్రజలు ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య రక్ష

- మళ్ళీ వైఎస్ఆర్సీపీ గెలిస్తేనే సంక్షేమ పథకాలు యధాతదం- ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్

విశాలాంధ్ర - సిద్ధవటం : రాష్ట్రంలోని పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకే జగనన్న ఆరోగ్య రక్షను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అన్నారు. సిద్ధవటం మండలం లోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు వైద్య శిబిరాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టి ప్రజల కోసం కృషి చేస్తున్నారన్నారు. పైసా ఖర్చు లేకుండానే ఇంటివద్దనే వైద్య పరీక్షలు చేసి మందులను ఇచ్చి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఆరోగ్య సురక్ష అన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను పొందేందుకు గతంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని పది కాలాల పాటు మంచి ముఖ్యమంత్రిగా కొనసాగేలా మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష అనేది ఒక బృహత్తరమైన కార్యక్రమన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్ళి వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మంచి వైద్యం అందించి మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు. మరలా ఏదైనా అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు పంపడం జరగుంతుదన్నారు. పేదల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి భారత దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్మోహన్ రెడ్డినే అన్నారు. ఆయన ఎన్నో మంచి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతి పథకంలో కూడా ఎలాంటి అవినీతి లేకుండా, 'దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా బటన్ నొక్కితే వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. పేద ప్రజలకు అండగా ఉండటం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాధవరం-2 గ్రామ సచివాలయం పరిదిలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లీనికు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, రైతు విభాగం మండల కన్వీనర్ పల్లెసుబ్బరామిరెడ్డి, వైస్ ఎంపిపి నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ జి. చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ పులి చంద్రకళ, ఉప సర్పంచ్ గునుగుంట్ల ఎల్లారెడ్డి, మాధవరం-1 సర్పంచ్ జానకిరామయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, కోఆప్షన్- సభ్యుడు సయ్యద్ సయ్యద్ నూర్, పార్టీ నాయకులు, శోభన్ రెడ్డి, సుధారాయుడు, సుధాకర్, శివరామిరెడ్డి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి, బండి నాగమునిరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, రోశిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ రెడ్డి, తహసీల్దారు లక్ష్మీదేవి, ఎంపీడీఓ జవహర్ బాబు, ఎంఈఓ శంకరయ్య, మరికొందరు అధికారులు, గ్రామ కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సుజాత, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ వర్కర్లు, వాలంటీర్లు, ప్రజలు తదిరతులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకాల సెలక్షన్ లిస్ట్

విశాలాంధ్ర -కడప : స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకాల ప్రకటన సంఖ్య 06 /2023 కు సంబంధించి జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ జిల్లా సెలక్షన్ కమిటీ కడప వారి ఆమోదం పొందిన రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్ట్ సెలక్షన్ లిస్ట్ ఆఫ్ బ్యాక్లాగ్ ఓపెన్ క్యాటగిరి మరియు లోకల్ కేటగిరీ కింద ఎంపికైన అభ్యర్థుల వివరములు. అభ్యర్థుల సమాచార నిమిత్తమై ఒఒఒ.ఝఒఝఒజూఝ. అఒఒ.ఒఅ వెబ్సైట్‌లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయము కడపలోని నోటీసు బోర్డు నందు ఉంచడమైనది ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు అన్నియు తీసుకొని 28 .10 .2023 శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం కడపలోని మీటింగ్ హాల్ లో కౌన్సిలింగ్ కొరకు హాజరు కావలసిందిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని బిటెక్ రవి మాట్లాడాలి: వైసీపీ

విశాలాంధ్ర-లింగాల: ఏ విషయమైన బిటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని వైసీపీ నాయకులు హితవు పలికారు. లింగాల కుడికాల్వలో జరుగుతున్న కట్అండ్‌కవర్ పనులను వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ పర్వదినాలల్లో ప్రెస్‌మీట్‌లు పెట్టి ఏవేవో అసంబద్ధ ప్రకటనలు చేయడం మంచిదికాదన్నారు. టిడిపి నాయకుడు బిటెక్ రవి పూర్తి అజ్ఞానంతో విషయ పరిజ్ఞానంలేకుండా మాట్లాడుతున్నారన్నారు. గత ఏడాది మార్చి నెల నుంచి సెప్టెంబరు వరకు లింగాల కుడికాల్వలో నిరంతరంగా నీరు ప్రవహించిందన్నారు. కాల్వలకు నీటిని విడుదల చేయలేదన్నట్లు బిటెక్ రవి మాట్లాడటం శోచనీయమన్నారు. టీడీపీ హయాంలో కుడికాల్వ పనులను టెండర్ల ద్వారా దక్కించుకుని పనులు పూర్తి చేయకుండా పారిపోవడం నిజంకాదా అని వారు ప్రశ్నించారు. తప్పులన్నీ అధికారంలో ఉన్న సమయంలో చేసి నేడు ఏమీ తెలియదన్నట్లుగా విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. మీరు చేసిన తప్పులను సరిదిద్దుతూ ఒక వైపు రైతులకు అండగా ఉంటూ మరోవైపు వారికి అవసరమైన సమయంలో కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారన్నారు. అలాగే కాల్వ పనులను కూడా చేస్తున్నామని వివరించారు. రెండు వారాలల్లో కట్అండ్‌కవర్ పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తారని వారు వెల్లడించారు. అలాగే క్రమం తప్పకుండా ఏటా పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బీమా విడుదల చేస్తోందన్నారు. సీజన్ పరంగా ఆ సీజన్‌లో నష్టం జరిగిన వెంటనే ప్రభుత్వానికి నివేదికలు అందిన తర్వాత వెంటనే రైతులను ఆదుకుంటూ ప్రభుత్వం బీమా విడుదల చేస్తోందన్నారు. టిడిపి నాయకులు కూడా ప్రభుత్వం అందించిన బీమాను పొంది నేడు బీమా రైతులకు ఇవ్వలేదనట్లు తెలపడం సిగ్గుచేటన్నారు. ఎక్కడో కూర్చుని మీడియా సమావేశాలల్లో అడ్డగోలుగా మాట్లాడటం సరికాదన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి నిజానిజాలు మాట్లాడాలని వారు బిటెక్ రవికి హితవు పలికారు. సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిసినా కూడా భూగర్భ జలాలు 10 అడుగుల లోపే ఉన్నాయని ఇంత సమృద్ధిగా భూగర్భ జలాలు ఉండటానికి కారణం వైఎస్ కుటుంబ సభ్యులకే దక్కుతుందన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులకు పూర్తిగా అవగాహన ఉంది కాబట్టే ఎక్కడో ఉన్న కృష్ణాజలాలను వారికే దక్కుతుందని వెల్లడించారు. టిడిపి హయాంలో చిన్న పెండింగ్ పనులు కూడా పూర్తిచేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నిరంజన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, జూలు ఫకురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.,

కాంగ్రెస్‌తోనే ప్రత్యేకహెూదా సాధ్యం

విశాలాంధ్ర-వేంపల్లె: కాంగ్రెస్‌పార్టీతోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహెూదా సాధ్యమని ఏఐసీసీ మాజీ సభ్యులు ధ్రువకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చక్రాయపేట మండలం ముద్దప్పగారిపల్లె గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా అప్పటి యుపిఏ ప్రభుత్వం 25రకాల అంశాలను ఏర్పాటు చేసే విధంగా చట్టం రూపొందించారన్నారు. వీటిలో ప్రధానంగా ఏపీకి ప్రత్యేకహెూదా, పోలవరం నిర్మాణం, దుగరాజపట్నం ఓడరేవు, కడపకు ఉక్కు పరిశ్రమ, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి బుందేల్‌కండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాలు ఉన్నాయన్నారు. అధికారం చేపట్టి దాదాపు తొమ్మిదన్నర సంవత్సర కాలం పూర్తయినా ఇంత వరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అధికారం చేపట్టిన అప్పటి టిడిపి ఇప్పటి వైసీపీ రెండు ప్రభుత్వాలు కూడా విభజన అంశాలపై నోరుమెదపకోవడం దారుణమన్నారు. విభజన అంశాలు నెరవేరనందు ఆంధ్రప్రదేశ్ ఎంతో వెనుకబడిపోయిందన్నారు. ప్రస్తుతం కరువు చాయలు అలముకున్నా ప్రభుత్వాలకు కనీసం చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. అదే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే విభజన అంశాలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తుందని, ఆ మేరకు తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అలాగే రాబోవు ఎన్నికలలో ఆరు సూత్రాలను ప్రధాన ఎజెండాగా ముందుకెళ్తామన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌పార్టీ విజయం తధ్యమని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, మాషీర్, వేమయ్యలు పాల్గొన్నారు.

ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పులివెందుల: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ అధిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ క్షేత్రస్థాయి అధికారులు శశిధర్, ఉమామహేశ్వరి, అసిస్టెంటు మేనేజరు మాధవిలు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని బ్రాహ్మణ పల్లె గ్రామంలో గురువారం ఏపీజీబీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ పథకాలపై కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని రుణాలు అందించడంలో తమ బ్యాంక్ ముందంజలో ఉందన్నారు. అలాగే వివిధ రకాల డిపాజిట్లపై అన్ని బ్యాంక్‌ల కంటే తమ బ్యాంక్ అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. విశిష్ట సేవలందిస్తున్న తమ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మెప్మా సీఈఓ నాయుడు, ఆర్‌పి పుష్ప పాల్గొన్నారు.

రమేష్‌కు తులసిరెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-పులివెందుల: కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌ను గురువారం పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పరామర్శించారు. గత కొంత కాలంగా వెన్నునొప్పి కారణంగా రమేష్ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపద్యంలో ఈ విషయం తెలుసుకున్న తులసిరెడ్డి పులివెందులకు వచ్చి రమేష్‌ను పరామర్శించారు. రమేష్ ఆరోగ్య క్షేమ సమచారం గురించి తెలుసుకున్నారు. తామున్నంత వరకు ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని భరోసా ఇచ్చారు. రమేష్‌ను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, వెంగళరెడ్డి, ఉత్తన్న, వినయ్ తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల: స్థానిక జువారి రైల్వే ట్రాక్ వెంబడి పిచ్చి మొక్కలను తొలగించి మొక్క లను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని మండల సీపీఐ సమితి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. పిచ్చి మొక్కల కారణంగా విషపురుగులతోపాటు పందులు ఆవాసం ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంత వాసులకు ఇబ్బందిగా మారిందని వారు ఆ వినతి పత్రంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి మండల కార్యదర్శి భవాని శంకర్ తో పాటు రాధాకృష్ణ సురేష్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కలెక్టరేట్ : కడప నూతన ఆర్డీవోగా ఆర్. మధుసూదన్ కడప ఆర్డీవో కార్యాలయంలో కడప ఆర్డీవో గా గురువారం ఉదయం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనంతపురం నందు పని చేస్తూ ప్రస్తుతం కడపకు బదిలీపై రావడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా లో పనిచేయడం అదృష్టంగా భవిస్తూన్నానని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల చేరువ చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పనిచేయడం జరుగుతుందన్నారు.

పుస్తకాలతో బీజేపీ రాజకీయం

విశాలాంధ్ర - యర్రగుంట్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు దుయ్యబట్టారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఎర్రగుంట్ల సంఘం అధ్యక్షులు లీలా కృష్ణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ముఖ్యఅతిథిగా పాల్గొన్న వలరాజు మాట్లాడుతూ ఇండియా స్థానంలో భారత్‌గా నామకరణం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాజకీయ రాబందులు విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శరత్ ఉపాధ్యక్షులు శివశంకర్‌తోపాటు మస్తాన్, లోకేష్, నాయక్, ప్రసాద్ లక్ష్మీనారాయణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే నివాళులు

విశాలాంధ్ర - సిద్ధవటం : మండలంలోని నేకనాపురంలో సీనియర్ వైసీపీ నాయకులు, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి గారి తండ్రి గారి పెద్దకర్మకు హాజరైన వారి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించిన రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి, మండల ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు ఏకుల రాజేశ్వరి రెడ్డి గారు, జవహర్ భాష గారు, జ్యోతి ముని రెడ్డి గారు,మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి గారు, సుబ్బారెడ్డి, శోభన్ రెడ్డి గారు, రాజంపేట వైఎస్ఆర్ సీపీ పట్టణ అధ్యక్షులు కృష్ణారావు, వైఎస్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హక్కులు సామాజిక న్యాయం కొరకు చలో ఢిల్లీ

విశాలాంధ్ర -పోరుమామిళ్ల : దళిత హక్కులను పరిరక్షించాలని, సామాజిక న్యాయం పరిరక్షణ కొరకు డిసెంబర్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విన్నవించాలని తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యులు, పోరుమామిళ్ల మండల కార్యదర్శి నాగ దాసరి వీరయ్య పిలుపునిచ్చారు. అంబేద్కర్ భవనంలో జరిగిన చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు అమల్లోకి తీసుకురావాలని, భూమిలేని ప్రతి పేదవాడికి అసైన్మెంట్ కమిటీ ద్వారా రెండు ఎకరాల భూ పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజులు కాకుండా 200 రోజుల పనిని కల్పించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాల్సిఉందని డిమాండ్ చేశారు. స్మశాన వాటికలో పనిచేస్తున్న వారిని నాలుగో తరగతి ఉద్యోగులు గా పరిగణించాలని, దేశంలో లౌకికవాదాన్ని అమలు చేయాలని అన్నారు. 401 సిఆర్పిసి నిబంధనలను రద్దు చేయాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలులోకి తీసుకురావాలని అన్నారు. డప్పు, చర్మకారులకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, పేదవారు నిర్మించుకునే గృహాలకు ఐదు లక్షల రూపాయల నిర్మాణ వ్యయాన్ని పెంచాలని, ఉపాధి హామీ పథకం కొరకు కేంద్ర ప్రభుత్వం 2 లక్షల కోట్ల నిధులు మంజూరు చేయాలని, ఉచిత విద్యుత్తు 200 యూనిట్లు నుండి 300 యూనిట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రత్నమయ్య, నరసింహులు, చిన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర అన్నమయ్య జిల్లా



మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధిపై దశలవారీగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం తన చాంబర్లో విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకేజీలు కాకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. అన్ని వార్డుల్లో శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు, దుఖానా దారులు ఎక్కడపడితే అక్కడ చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలన్నారు. వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే కౌన్సిలర్లకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు ననిశెట్టి నవీన్ కుమార్, న్యామతుల్లా, రఘునాధ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మచెరువు మిట్ట వద్ద జాతీయ రహదారి నిర్మాణం హైవే అలైన్మెంట్ ప్రకారమే నిర్మించాలి

ఎన్‌ఎచ్ డిఇని కలిసిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-మదనపల్లి : అమ్మచెరువు మిట్ట జాతీయ రహదారి నిర్మాణం,హైవే అథారిటీ ఇచ్చిన అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణం చేయాలని,అమ్మచెరువు మిట్ట ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని మిట్ట ప్రాంతాన్ని ఎక్కువ తగ్గించకుండా,అమ్మ చెరువు మిట్ట డౌన్లో రోడ్డును హైట్ లేపాలని ఎన్ హెచ్ డిఇ గారిని కలిసిన సిపిఐ నాయకులు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె మురళి మాట్లాడుతూ అమ్మాచేరువు మిట్ట ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుందని ఈ ప్రాంతంలో రహదారి మలుపు తిప్పడం సరైంది కాదని అన్నారు. ఈ ప్రాంతంలో హైవే అథారిటీ వారు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం రోడ్డు నిర్మాణం చేయలేదని, ఈ ప్రాంతంలో రోడ్డు మలుపులు తిరిగితే వాహనదారులకు ప్రమాదమని,ఈ మలుపులు తొలగించకుండా రహదారి నిర్మించడం సరికాదని ఎన్ హెచ్ డిఇ ని కలిసి మాట్లాడడం జరిగిందని అన్నారు.రహదారి అలైన్మెంట్ రూట్ మ్యాప్ ప్రకారమే రోడ్డు నిర్మాణం జరుగుతుందని,అలైన్మెట్ మార్చడానికి ఎవరికి అథారిటీ లేదని అన్నారని, ఆ ప్రాంతంలో అలైన్మెంట్ కు విరుద్ధంగా జాతీయ రహదారి నిర్మాణం జరగడానికి వీలులేదని వెంటనే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని అన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కొన భాస్కర్,సుధాకర్ నాయుడు,రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ గ్యారెంటీ శిక్షణ తరగతులకు నాయకుల హాజరు

హాజరైన టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: "బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ" పై రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు వారి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్లస్టర్ ఇన్‌ఛార్జి యూనిట్ ఇన్చార్జిలు,బూత్ కన్వీనర్లు, బీఎల్ఏలకీ ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ తరగతులు ఉద్దేశించి మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని కోరుతూ ఇప్పటికే అధినేత ప్రకటించిన పథకాలపై ప్రజలకు అవగాహన,అలాగే బూత్ కన్వీనర్లు, బీఎల్ఏలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల జాబితాలో వారి పేర్లు ఉన్నాయా లేవో సరి చూడాలని తెలియజేశారు. అలాగే రిజిస్ట్రేషన్ చేయించాలని టీడీపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. తొలుత నియోజకవర్గ ఇన్చార్జ్ బత్యాల చెంగల్ రాయుడు జగన్ మోహన్ రాజు గారిని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్చార్జులు టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన హాస్టల్ భవనానికి భూమి పూజ

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీలో బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో నూతనంగా హాస్టల్ బిల్డింగ్కు భూమి పూజ గురువారం బిట్స్ ఇంజనీరింగ్ చైర్మన్ భాస్కర్ భూమి పూజ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభమైందని కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల కోసం నూతన హాస్టల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కళాశాల కడప- రాయచోటి జాతీయ రహదారి మార్గంలోనే ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో బీటెక్ అర్టిఫీయల్ ఇంజనీరింగ్ ఇంటలిజెన్స్ కోర్సులను ఏదాది క్రితమే ప్రపంచంలో ఈ కోర్సులను ప్రవేశపెట్టలేదు. ఈ విద్యా వ్యవస్థ సామాజిక సేవకుడు. వ్యాపారవేత్త భారీ బడ్జెట్తో అనేక పట్టణాలకు రాష్ట్ర రాజధానులు దీటుగా ఈ కళాశాలలో ఏర్పాటు చేశారన్నారు. కళాశాలలో సీఎస్సీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ ఇంటలిజెన్స్ కోర్సులను ఏర్పాటు చేశామన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్లో 418 ప్రభుత్వ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణలో 205 ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో ఉన్నాయన్నారు. వీటి అన్నిటిలో రెండో రాష్ట్రంలో అర్టిఫియల్ వింటెలిజెన్స్ ఇంజనీరింగ్ కోర్సులకు ఏర్పాటు చేశారన్నారు. సాంకేతిక విద్యతోపాటు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి కృషి చేస్తున్న చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వాసుదేవుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజన చట్టాలు అందరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర- గాలివీడు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడపబడే సంస్థలలో అవినీతి నిర్మూలనకై ఉన్న ప్రజాప్రయోజన చట్టాల మీద ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోలార్ పవర్ గ్రిడ్ డీజీఎం చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని స్థానిక రవిచంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఈ చట్టాల మీద అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి ఏ స్థాయిలో జరిగిన అది దేశ అభ్యున్నతికి ప్రమాదమని కేంద్ర స్థాయి సంస్థలలో జరిగే అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరికి ప్రజా ప్రయోజన చట్టాల మీద అవగాహన కలిగి ఉండి దేశ నిర్మాణంలో భాగం కావాలని విద్యార్థిని విద్యార్థులకు ఆయన వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు దామోదరం, ఆనంద్, జేఈ అమర్నాథ్ పాఠశాల యాజమాన్యం,ప్రిన్సిపల్ నూతన నాయక్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నమయ్య వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమయ్య వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన పార్టీ రాజంపేట ఇంచార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. గురువారం అమ్నమయ్య వరద బాధితుల అవస్థలు గురించి జనసేన పార్టీ అసెంబ్లీ ఇంచార్జి మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ఎల్లమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మలిశెట్టి వెంకటరమణకు సంఘీభావం తెలిపారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి ఫ్లై ఓవర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు జనసేన, టిడిపి నాయకులు సంయుక్తంగా ర్యాలీగా బయలుదేరి వెళ్లి ఆర్డీవో రామకృష్ణారెడ్డికి అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులను ఆదుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కోటయ్య నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య. కడప జిల్లా లీగల్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రాజు, ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, జనసేన నాయకులు భాస్కర పంతులు, వెంకటేశ్వరరావు, రామా శ్రీనివాసులు, గోపి, గోపాల్, చౌడయ్య, జనసేన వీర మహిళలు జడ్డ శిరీష,మాధవి పాల్గొన్నారు.

కృష్ణా జలాల పునః పంపిణీపై బీజేపీ ప్రభుత్వం కుట్రకు తెరలేపింది

- అఖిల పక్షనేతల ఆగ్రహం

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: కృష్ణా జలాల పునః పంపిణీ పై బిజెపి ప్రభుత్వం భారీ కుట్రకు తెరలేపిందని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఈ అంశాన్ని భుజానకెత్తుకుందని అఖిలపక్షం నాయకులు తీవ్రంగా విమర్శించారు. గురువారం సిపిఐ ప్రధాన పార్టీ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు మలిశెట్టి రాహుల్ అధ్యక్షతన కృష్ణా జలాల పునః పంపిణీ పై బిజెపి ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కు 512 టిఎంసి లు, తెలంగాణా కు 299 టిఎంసి లు నీటిని కేటాయించారన్నారు.ఆ నిర్ణయాన్ని తుంగలో తొక్కి ఎపి కి వస్తున్న నీటిని ఎసరు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు.బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టులో ఉందన్నారు.మిగులు జలాలు వినియోగించుకునే హక్కు దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కే ఉందన్నారు.కృష్ణా మిగులు జలాల పైఆధారపడే గాలేరు నగిరి, హంద్రీనీవా,తెలుగుగంగా, వెలిగొండ ప్రాజెక్టులు చేపట్టారని తాజా నిర్ణయంతో అ ప్రాజెక్టుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందన్నారు.ఎన్నికలు వచ్చిన ప్రతి సారి మోడీ రాష్టాలలో జల వివాదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధికోసం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రాజెక్టులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట ప్రయోజనాలను దెబ్బ తీసేందుకు జగన్ పూనుకున్నారని విమర్శించారు. ఈ నెల 4 న ఢిల్లీలో కేంద్ర క్యాబినెట్ సమావేశమై కృష్ణా జలాల పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినా అక్కడే ఉన్న ముఖ్యమంత్రి జగన్ నోరు విప్పకపోవడంపై చూస్తుంటే రాష్ట్రం ఏమైనా పర్వాలేదు,తాను మాత్రం కేసుల నుంచి బయటపడితే చాలన్నట్టు ఉందని విమర్శించారు.సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగంపై జగన్ కు చిత్త శుద్ధి లేదన్నారు. నాలుగన్నర ఎళ్లలో జగన్ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదని విమర్శించారు.21 మంది వైసిపి పార్లమెంట్ సభ్యులు ఉన్నా ప్రయోజనం లేదన్నారు.తెలంగాణాలో ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, రాయలసీమ కు తీవ్ర అన్యాయం చేస్తూ తెలంగాణలో అధికారంలోకి రావడమే ధ్యేయంగా గెజిట్ నోటిఫికేషన్ తీసుకువచ్చారని విమర్శించారు.దీంతో రాయలసీమ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందన్నారు.కర్నాటక ఎన్నికల సందర్భంగా వివాదాస్పదంగా ఉన్న ఎగువభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రూ.5600 కోట్లు కేటాయించారన్నారు.పోలవరం ప్రాజెక్టు మొదటి దశ కుదించే కుట్ర కొనసాగుతోందన్నారు.రాష్ట్రంలో 671 మండలాలు ఉండగా అందులో 611 మండలాలు సాగునీరు లేక తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని,దీంతో రైతుల ఆత్మహత్యలు,వలసలు కొనసాగుతున్నాయన్నారు.అందరి అభిప్రాయాలు తీసుకుని ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. సాగునీటి సాధన కోసం మరో యుద్ధానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు మలిశెట్టి జితిన్, అన్నమయ్య జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు టి రాధాకృష్ణ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, దాసరి వీరేంద్ర, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య,సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కేశం ప్రసాద్, పెనగలూరు మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ,సిపిఐ సీనియర్ నాయకులు మలిశెట్టి వెంకటయ్య,ఎస్ఎం యానాది,సిపిఐ ఎంఎల్ నియోజకవర్గ కార్యదర్శి దాసరి జయచంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ మహమ్మద్, ఓబులవారిపల్లి సిపిఐ సభ్యులు మడగలం రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం పనులు వేగవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: క్రికెట్ స్టేడియం పనులు నాణ్యతగా వేగవంతంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పియస్ సూచించారు. గురువారం రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామపంచాయతీ నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించిన కలెక్టర్ పరిశీలించారు. స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు, స్టేడియం ప్రధాన పెవిలియన్ భవన నిర్మాణ ప్రగతి, స్టేడియం నుండి ప్రధాన రోడ్డు నిర్మాణం అంశాలపై ఆ ప్రాతం మొత్తం విస్తృతంగా కలియ తిరిగి పరిశీలించి ఇందుకు సంబంధించి రెవిన్యూ, ఆర్అండ్బి, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నవంబర్ 15లోగా నాణ్యతగా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మంచి సాయిల్ తీసుకొని వచ్చి గ్రౌండ్ లో 2 ఇంచ్ ల మేర వేసి పచ్చదనం కోసం గడ్డి విత్తనాలను చల్లాలని సూచించారు. గ్రౌండ్ మొత్తం గడ్డి పచ్చదనంతో నిండాలన్నారు. స్టేడియం చుట్టూ మరియు స్టేడియం రోడ్డు కిరువైపులా నాటిన చెట్లకు ప్రతిరోజు నీటిని అందించే కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పెవిలియన్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, వాలీబాల్, టెన్నిస్, బాస్కెట్ బాల్ ఓపెన్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలనీ చెప్పారు. పెద్ద హై మాస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రెవిన్యూ, ఆర్అండ్బి, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో నవంబరు 15లోగా పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి జిల్లా అధికారి సహదేవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ గంగప్రసాద్, తాసిల్దారు హేమంతకుమార్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో వేతనాలు తక్షణమే చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర-పీలేరు:-పీలేరు నియోజకవర్గంలోని కెవి పల్లి మండలం తో పాటు ఇతర మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందక పండగల పూట కూడా పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని తక్షణమే గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం ఒక ప్రకటనలో కోరారుజిల్లేలమంద పంచాయతీలో 16నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందలేదన్నారు స్థానిక పంచాయతీ కార్యదర్శిలు జిల్లాలో డీపీఓ గ్రీన్ అంబాసిడర్ కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న పై స్థాయి అధికారులకు నెల నెలా వేతనాలు చెల్లిస్తున్నారని అదే పంచాయతీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు ఎందుకు వేతనాలు చెల్లించడం లేదని ఆయన ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. అధికారపార్టీ నాయకులు, ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో జరగా లంటే ఆ ప్రాంతాలను శుభ్రం చేయడంలో కీలకపాత్ర గ్రీన్ అంబా సిడర్ కార్మికులు పోషిస్తున్నారని అటువంటి పారిశుధ్య కార్మికులకు 16 నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ఉండటం అమానుషం అన్నారు. జిల్లా డీపీఓ స్పందించి పెండింగ్లో ఉన్న వేతనాలు గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు చెల్లించకపోతే ఆకలి పోరాటం తప్పదన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల పాలిట రక్షణ కవచం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యం పేద ప్రజల ఆరోగ్యం పాలిట రక్షణ కవచమని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉల్లగట్టుపోడు సర్పంచి కోటగుండ్ల గోపి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా ఏడు రకాల ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి విలువైన మందులు ఉచితంగా అందించామన్నారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష ఆశయాలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వైద్య శిబిరాలలో సర్పంచులు ఎంపీటీసీలు తదితర ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములు కావాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సిఐ టి. మధుసూదన్ రెడ్డి, ఎంపిడిఓ జాషువా, జడ్పిటిసి రత్నమ్మ, ఎంపిటిసి గని, ఓబుల్ రెడ్డి, రఘు, సిద్దయ్య, పంచాయతీ సెక్రెటరీ అనిత, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్ లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం నాయకుల డిమాండ్

విశాలాంధ్ర- గాలివీడు: రబీతో నష్టపోయినా ఖరీఫ్ సీజన్ కాటేసినా రైతన్నను మాత్రం ఆదుకునే నాథుడే లేడా అంటూ ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రంగారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గురువారం గాలివీడు మండలకేంద్రంలోని పశువుల సంతను సందర్శించి పాడి రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ రైతులు పండించిన వేరుశనగ, వరి,టమోటా పంటలు వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయారన్నారు.రైతులు ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారమై గొర్రెలు,మేకలను విక్రయించి నెట్టుకొస్తున్నారని అవేదన్ వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా కరువు తాండవమాడుతుంటే ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు.మరోవైపు ప్రాజెక్టుల విషయానికి వస్తే అన్నమయ్య ప్రాజక్టు తెగిపోయి మూడు సంవత్సరాలైనా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.ఇక వెలిగల్లు ప్రాజక్టు కాలువలు సంగతైతే మరీ దారుణం కాలువలు పూర్తికాక పోయినా గుత్తేదారులు మాత్రం పూర్తిస్థాయి బిల్లులు చెల్లింపులు జరిగిపోవడం దారుణమన్నారు.తక్షణమే నష్టపోయిన రైతులను గుర్తించి యకరాకు రూ.40 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా సబ్సిడీ విత్తనాలు,ఎరువులు రబీ సీజన్ కైనా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు పంటనష్టం అందేవరకూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలకు ఉద్యతం చేస్తామని హెచ్చించారు.

చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేసి ఆయన ఆశయాన్ని ఆపలేరు

సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజంగెలవాలి కార్యక్రమంలో టీడీపీ నల్లారి

విశాలాంధ్ర-పీలేరు:-రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది అనవసరమైన అక్రమ కేసులు పెట్టి,తీవ్ర ఇబ్బందులకు గురి చేయడానికి కాదని,ప్రజల సంక్షేమం, ప్రజాసేవ చేయడానికిఅంటూప్రభుత్వంపైవిమర్శలుగుప్పించిన,తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియోజకవర్గ బాధ్యులు అధికార పార్టీ నాయకులపై దుమ్మెదులిపారు.టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజంగెలవాలి కార్యక్రమంలో కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ తో మనోవేదనకు గురై మృతి చెందిన కార్యకర్తలు వెంకట సుబ్బయ్య గౌడ్,గాలి సుధాకర నాయుడు, వెంకటరమణ కుటుంబాలకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసిభువనేశ్వరినివాళులర్పించిన భువనేశ్వరి. ఈకార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరుజిల్లా నలు మూలలనుండి టీడీపీ నాయకులు,,శ్రేణులు ఇంచార్జ్ లు,మహిళలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ క్రాఫ్ నమోదు పూర్తి:ఏవో

విశాలాంధ్ర -గుర్రంకొండ: మండలంలో ఖరీఫ్-2023 సీజన్ లో 6184 ఎకరాలలో పంటల సాగు మరియు ఈ- క్రాప్ పూర్తిచేయుటం జరిగినది. జిల్లాలోని గ్రామాలలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26-10-2023 వ తేదీ నుండి 29-10-2023 వరకు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం గ్రామసభలలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో వున్న రైతుల ఈ క్రాప్ నమోదు తెలపడం జరుగుతుంది రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడిన ముసాయిదా జాబితాను రైతు సోదరులు పరిశీలించి, అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లైతే సవరణ కొరకు రైతు భరోసా కేంద్రములో వున్న వి.ఏ.ఏ/ వి.హెచ్.ఏ / వి.ఎస్.ఏ.లను సంప్రదించి అభ్యంతరములు వ్రాతపూర్వకముగా తెలియచేయవలసినదిగా రైతులందరకి అవగాహన కల్పించాలన్నారు. ఈ-క్రాప్ ఖరీఫ్ - 2023 సీజన్ సవరణ కొరకు ఇది ఆఖరి అవకాశం. తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు మరియు చేర్పులు చేయబడవు అని తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-నందలూరు :: మండలంలోని పాటూరు గ్రామ ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై గురువారం నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్ అవగాహనా కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ పోన్ వాడే ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన తప్పనిసరని తెలిపారు. డబ్బులకు ఆశపడి యువత ఆన్‌లైన్ నందు డబ్బులు పెట్టి నష్టపోతున్నారని, దీనితో బలవన్మరణానికి కూడా పాల్పడి తల్లిదండ్రులకు తీరని లోటుని కలిగిస్తున్నారని అన్నారు. అనంతరం డ్రగ్స్, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు, దిశా యాప్ లపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కానిస్టేబుళ్ళు మహేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడవ విడత కౌన్సిలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర-పీలేరు:-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాసిన విద్యార్థులకు మూడవ కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి,విద్యాశాఖ మంత్రి స్పందించి ఒకటవ,రెండవ కౌన్సిలింగ్ నిర్వహించిన విధంగా ప్రభుత్వం మూడవ కౌన్సిలింగ్ నిర్వహించాలని,చాలామంది విద్యార్థులు మూడవ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.అనేక మంది విద్యార్థులు సామాజిక మధ్యమాల ద్వారా తమకు న్యాయం చేయాలని ఎన్.ఎస్.యూ.ఐ నాయకులకు సందేశాలు పంపుతూ వారికి అండగా నిలవాలని కోరినట్టు తెలిపారు.ఒకటి,రెండు కౌన్సిలింగ్ కు హాజరైన విద్యార్థులకు మరియు ఇతర ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు కూడా మూడవ కౌన్సిలింగ్లో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేవలం ఒకటి రెండు కౌన్సిలింగ్లలో 77% మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయని మిగతా 27,590 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.అలాగే మూడవ కౌన్సిలింగ్ నిర్వహిస్తే దాదాపుగా 13వేల మందికి పైగా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.దీనిపైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గారు స్పందించి విద్యార్థులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించాలని తెలిపారు.మూడవ కౌన్సిలింగ్ నిర్వహించలేని తరుణంలో విద్యా శాఖ మంత్రి కార్యాలయాన్ని,ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని ఎస్.ఎస్.యూ.ఐ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని తెలిపారు.

కౌశల్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి:భారతీయ విజ్ఞాన మండలి ఆంధ్రప్రదేశ్ శాసన సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో కౌన్సిల్ 2023 పరీక్షకి నోటిఫికేషన్ విడుదలైందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రామ్ పురుషోత్తం అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌశల్ 2023 పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌశల్ సైన్స్ క్విజ్ పోటీని 8,9,10 తరగతుల విద్యార్థులతో క్విజ్ టీం ఏర్పడాలన్నారు. ఇది కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే అని అన్నారు. కనుక జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ పరీక్ష రాసే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిలబస్ గా 8,9, 10 తరగతిలో గణితము, సైన్సు, సాంఘిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి మెటీరియల్, నిర్ణయించారు. బహుమతులు, ప్రశాంశా పత్రాలు, జ్ఞాపిక, నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల కోఆర్డినేటర్లు నవంబర్ ఐదు లోపు విద్యార్థుల పేర్లను డబ్ల్యు డబ్ల్యు డాట్ బి వి ఎం డాట్ ఏపీ డాట్ ఓఆర్జి లో నమోదు చేసుకోవచ్చన్నారు. 8, 9 తరగతుల నుండి ఇద్దరు రెండు ప్రజెంటేషన్లో ఒక పాఠశాల నుండి అనుమతించబడునన్నారు. బహుమతులు సర్టిఫికెట్, జ్ఞాపిక నగదు అందిస్తామని అన్నారు. కౌశల్ సైన్స్, క్విజ్ పోటీ అర్హులు 8,9,10 తరగతుల విద్యార్థుల సంఖ్య 3 (క్విజ్ టీం సంఖ్య కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అన్నారు) 8, 9, 10 తరగతిలో గణితము, సైన్స్ సాంఘిక శాస్త్ర, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి మెటీరియల్ భారత్ దర్శన్ మెటీరియల్ చదవాలని అన్నారు. బహుమతులుగా సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు అందజేస్తారని అన్నారు. 2023 గా ఉందన్నారు ప్రాథమిక స్థాయి పరీక్ష ఆన్లైన్లో 6 7 8 డిసెంబర్ 2023 తేదీలలో జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు 20 డిసెంబర్ 2023న, రాష్ట్రస్థాయి పోటీలు 30 డిసెంబర్ 2023 న ఉంటాయన్నారు. పాఠశాల కోఆర్డినేటర్లు నవంబర్ 5వ తేదీ లోపు విద్యార్థుల పేర్లను బివిఎం ఏపీ సైట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ద్వారా అందజేయబడునని అన్నారు.

స్కూటర్ ఢీకొని రైతు పరిస్థితి విషమం

విశాలాంధ్ర-మదనపల్లి : స్కూటర్ ఢీకొని రైతు పరిస్థితి విషమించిన ఘటన గురువారం వాల్మీకిపురములో జరిగింది. ఘటనపై వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మండలంలోని పేరంపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి(70) సొంత పనిమీద గురువారం వాల్మీకిపురానికి వచ్చాడు. బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టు మల్లయ్య, అతని తల్లి రాజమ్మ తీవ్రంగా గాయపడగా.. రైతు వెంకటరమణ రెడ్డి తీవ్రంగా గాయపడి కోమల్లోకి చేరుకున్నాడు. వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ సిక్కిచల అందించిన డాక్టర్లు వెంకటరమణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లికి రిఫర్ చేశారు. జిల్లా ఆస్పత్రి డాక్టర్లు పరీక్షించి అతని పరిస్థితి మరింత విషమించడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.